సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



అమ్మవార్లకు వెండి కిరీటాలు

పి.గన్నవరం: పోతవరం గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు డాక్టర్ నెక్కంటి సుధాకరరావు, లక్ష్మీ సరోజిని దంపతులు శనివారం రూ.90 వేల వెండి కిరీటాలు సమర్పించారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 4,77,227 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది.

వాడపల్లి క్షేత్రం.. భక్తజనసంద్రం



వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తజనసంద్రంగా మారింది. స్వామివారిని సుమారు 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.

8లో



అశేష జనవాహినికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం



సభా వేదికపై సీఎం జగన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

నిడదవోలు.. జనహోరు

- సీఎం జగన్‌పై అడుగడుగునా వెల్లువెత్తిన అభిమానం
- వైఎస్సార్ కాపు నేస్తం సభకు పోటెత్తిన ప్రజానీకం
- సభ ప్రారంభం నుంచి ముగింపు వరకూ మిన్నంటిన 'సీఎం' నినాదాలు
- ఘన స్వాగతం పలికిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజలు

సాక్షి, రాజమహేంద్రవరం: తమ ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో అశేష ప్రజానీకం నీరాజనం పట్టారు. వైఎస్సార్ కాపు నేస్తం పథకం కింద కాపు, బలిజ, తెలగ, ఒంటరి సామాజికవర్గాల్లోని అక్కచెల్లెమ్మలకు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు వచ్చిన జననేతకు జేజేలు పలికారు. వెల్లువలా తరలివచ్చిన ప్రజలు 'జై జగన్.. సీఎం' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా.. మిన్నంటేలా ముక్తకంఠంతో నినదించారు. అడుగడుగునా అభిమానం చూపుతూ అక్కున చేర్చుకున్నారు. కాపు మహిళలు తమ సొంత సోదరుడు, బిడ్డ వచ్చినట్టే భావిస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. హెలిపాడ్ నుంచి సభా ప్రాంగణం వరకూ సీఎం జగన్‌పై పూలవర్షం కురిపించారు. నిడదవోలు పట్టణంలోని సెయింట్ ఆంబ్రోస్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో.. రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్ కాపు నేస్తం పథకం నిధుల విడుదలను సీఎం జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు నేరుగా బదిలీ చేశారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన ఆయన నిడదవోలు సమీపంలోని సుబ్బరాజుపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి బస్సులో 11.07 గంటలకు సభా వేదిక వద్దకు చేరుకున్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. అనంతరం జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆద్యంతం ఉత్సాహంగా ప్రసంగం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఉదయం 11.43కు ప్రారంభమై 12.20 గంటల వరకూ సాగింది. ఆయన ప్రసంగంతో సభలో ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది. సీఎం ప్రసంగిస్తున్నంతసేపూ ఈలలు, చప్పట్లతో ప్రజలు, అభిమానులు మద్దతు పలికారు. ప్రజల ఉత్సాహం చూసి సీఎం సైతం చిరునవ్వుతో అభివాదం చేశారు. వివక్షకు తావు లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెప్పగానే మహిళలు ఒక్కసారిగా పైకి లేచి ఈలలు వేశారు. ఏ ప్రభుత్వంలోనూ ఇవ్వనన్ని ఉద్యోగాలు ఇచ్చామని, ప్రతి ప్రభుత్వ శాఖలో జగనన్న ఉద్యోగులు ఉన్నారని చెప్పగానే.. ఒక్కసారిగా 'జై జగన్' అంటూ నినదించారు. యువత, ఉద్యోగులను చంద్రబాబు మోసం చేశాడని, వెన్నుపోటు పొడిచే ఆయనతో జాగ్రత్తగా ఉండాలని సీఎం జగన్ సూచించారు. చంద్రబాబు రూ.కోట్లు దోచుకుంటూంటే, ఆయనకు మద్దతు పలికే దొంగల ముఠా బాబును ఎలా కాపాడాలా అని ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. 'రూ.కోట్లు దోచేస్తూంటే అరెస్టు చేయకూడదంట.. చట్టం ఎవరికైనా ఒక్కటే కదా?' అని ప్రశ్నించగానే.. 'అవును.. అవును' అంటూ ప్రజలు పెద్దపెట్టున సీఎంకు మద్దతు పలికారు. ఇన్నాళ్లూ ప్రశ్నించే వారు లేక చంద్రబాబు ఆటలు సాగాయని.. ఇప్పుడు పాపం పండిందని చెప్పారు. అవినీతిపై ప్రశ్నిస్తానన్న దత్తపుత్రుడు వాటాలు తీసుకుని, ప్రశ్నించకుండా జైలుకు వెళ్లి, ములాఖత్ పేరుతో మిలాఖత్ అయ్యాడని సీఎం అనగానే.. జనం ఒక్కసారిగా పైకి లేచి 'దొంగ.. ప్యాకేజీ స్టార్' అంటూ నినదించారు. ఇలా సీఎం ప్రసంగం మొత్తం ఫుల్ జోష్‌తో సాగింది.

అడుగడుగునా ఆత్మీయత

నిడదవోలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అడుగడుగునా ఆత్మీయత చూపారు. సీఎం రాక కోసం ఉదయం నుంచే ఎదురు చూశారు. సుబ్బరాజుపేట హెలిపాడ్ నుంచి సభా ప్రాంగణానికి వెళ్లే దారి పొడవునా జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టారు. రోడ్డుకు ఇరువైపులా మహిళలు, యువత పూలవర్షం కురిపించారు. 'జై జగన్, పొలిటికల్ సూపర్‌స్టార్ జగనన్న' అంటూ నినాదాలు చేశారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో చిన్నారులతో కళా ప్రదర్శనలు నిర్వహించారు. సీఎం జగన్ రాకతో నిడదవోలు గణేష్ చౌక్, గణపతి సెంటర్, బస్టాండ్, రైల్వే స్టేషన్, సింగవరం వెళ్లే రోడ్లలో ఎటూ చూసిన జనసందోహమే దర్శనమిచ్చింది. సభా వేదికపై సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మీయ సత్కారం లభించింది. కాపు నేస్తం లబ్ధిదారులు, కాకినాడ ఎంపీ వంగా గీత, ఇతర ప్రజాప్రతినిధులు శాలువా కప్పి, సన్మానించారు.

హెలిపాడ్ వద్ద ఘన స్వాగతం

అంతకుముందు హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మార్గాని భరత్‌రామ్, వంగా గీత, కోటగిరి శ్రీధర్, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, జెడ్పీ చైర్మన్లు విప్పర్తి వేణుగోపాలరావు, ఘంటా పద్మావతి, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయిల్, కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యేలు జి.శ్రీనివాస్‌నాయుడు, కురసాల కన్నబాబు, జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణరెడ్డి, పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, పెండెం దొరబాబు, తలారి వెంకట్రావు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ, కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, రౌతు సూర్యప్రకాశరావు, జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సభాప్రాంగణంలో సీఎం ఫ్లకార్డులు చూపిస్తున్న మహిళలు



సభాప్రాంగణం లోపల.. బయట.. ఎటు చూసినా జనమే..

నిడదవోలుపై వరాల జల్లు

నిడదవోలు నియోజకవర్గంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. సభలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు చేసిన విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించారు.

- విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం వరకూ కెనాల్ రోడ్డు నిర్మాణానికి రూ.66 కోట్లు కేటాయిస్తున్నామని చెప్పారు. తద్వారా పెరవలి, నిడదవోలు మండలాలకు చెందిన 17 గ్రామాల ప్రజలకు రవాణా వ్యవస్థ అందుబాటులోకి రానుంది.
- చిన్న కాశీ రేవు వంతెనకు రూ.4.65 కోట్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి రూ.19 కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా విస్తరించేందుకు ఆమోదం తెలిపారు.
- అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్, బీసీ కమ్యూనిటీ హాల్, మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్, షాదీ ఖానాల అభివృద్ధికి నిధులు కేటాయించనున్నామని తెలిపారు.
- విజ్జేశ్వరం ఏటిగట్టు నుంచి సిద్ధాంతం వరకూ రోడ్డుకు, ఆటోనగర్ అభివృద్ధికి, ఉండ్రాజవరం మండలం వడ్లూరు నుంచి అత్తిలికి కాలి బాట వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారు.
- నిడదవోలు ఆర్టీసీ డిపో అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు చేయనున్నట్టు ప్రకటించారు.

న్యూస్‌రీల్

20 నుంచి బొమ్మూరు డైట్‌లో వర్క్‌షాప్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు డైట్‌లో 8, 9వ తరగతుల భాషేతర విషయాల్లో కఠిన అంశాల గుర్తింపుపై ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకూ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.ఎస్‌డీవీ రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా తరగతుల్లో పాఠ్య విషయాలు మారడంతో వాటిలో కఠినతర అంశాలు గుర్తించి సులభంగా అర్థమయ్యేలా బోధించడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. ఈ వర్క్‌షాప్‌నకు తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రతి మండలం నుంచి 8, 9 తరగతుల భాషేతర విషయాలను ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్న ఉపాధ్యాయులు తరలి రావాలన్నారు. ప్రతి మండలం నుంచి గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయుల్లో ఒక్కొక్కరు చొప్పున హాజరు కావాలన్నారు. 20న 8, 9 తరగతుల గణితం ఉపాధ్యాయులు, 21న భౌతికశాస్త్రం, 22న జీవశాస్త్రం, 23న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. సంబంధిత పాఠ్య పుస్తకాలతో వర్క్‌షాప్‌నకు ఆయా తేదీల్లో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

రూ.2,67,280 విలువైన సరకు జప్తు

కాకినాడ సిటీ: పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాకు సంబంధించి శనివారం ఏడు కేసులను విచారించి, సీజ్ చేసిన రూ.2,67,280 విలువైన సరుకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు జేసీ ఎస్.ఇలక్కియ తెలిపారు. అలాగే ఎఫ్‌పీ షాపు డీలర్లు, ఎండీయూ వాహనదారులకు రూ.4,200 జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఈ మొత్తం పౌరసరఫరాల ఖాతాకు జమ అవుతుందని జేసీ ఇలక్కియ వివరించారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో 'పర్యావరణ సవాళ్లు.. సుస్థిర భవిష్యత్తుకు పరిష్కార మార్గాలు' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమహేంద్రవరం ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ మాట్లాడుతూ పునరుత్పాదక శక్తి వనరులపై పరిశోధనలు జరపాలన్నారు. ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్న తరుణంలో త్వరలో ఇంధన వినియోగం మరింత పెరుగుతుందన్నారు. ఆ లోటును సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ప్రముఖ కళాకారుడు గజల్ శ్రీనివాస్ పర్యావరణ ఆవశ్యకతను గజల్స్ ద్వారా పాడి వివరించారు. కడప యోగి వేమన యూనివర్సిటీ ఆచార్యులు శంకర్ మాట్లాడుతూ హైడ్రోజన్ వాయువును సంప్రదాయేతర ఇంధనంగా ఉపయోగించేందుకు జరుగుతున్న పరిశోధనలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామచంద్రయ్య మాట్లాడుతూ వచ్చే కాలంలో కార్బన్ డై ఆక్సైడ్ వంటి వాటితో ఉపయోగకర ఇంధనాలుగా మార్చేందుకు గల అవకాశాలను వివరించారు. అనంతరం నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు శాస్త్రవేత్తలతో ఇష్టాగోష్టి నిర్వహించారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.మల్లికార్జున, కోకన్వీనర్లు జె.జాకబ్, వి.శ్రీధర్, టి.నరసింహమూర్తి, బి.వెంకటరావు, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు, నవదంపతులు, వారి బంధుమిత్రులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నవదంపతులు సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించినట్లు అధికారులు తెలిపారు. సత్యదేవుని వ్రతాలు రెండు వేలు జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో నాలుగు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఏర్పాట్లను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌సీసీ అకాడమీలు

- ఏర్పాటుకు సీఎం జగన్ హామీ
- ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి

రాజానగరం: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌సీసీ అకాడమీలను ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలుసుకుని ప్రస్తావించగా, అందుకు 40 ఎకరాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ ఫైరింగ్ క్యాంప్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తనను కలసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 19 నుంచి అఖిల భారత తలసేన శిబిరం ఢిల్లీలో, 23 నుంచి అఖిలభారత వాయుసేన శిబిరం బెంగళూరులో, అక్టోబరు రెండో వారంలో నవసేన ఎంపికలు జరుగుతాయన్నారు. అలాగే అక్టోబరులో రిపబ్లిక్ డే సెలక్షన్స్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 1.25 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఉండగా మరో లక్ష మందిని ఎంపిక చేస్తామన్నారు. ఏపీ నుంచి 52 వేలు, తెలంగాణ నుండి 48 వేల మందికి అవకాశం ఉంటుందన్నారు. పెరిగిన జిల్లాలకు అనుగుణంగా ప్రతి జిల్లాలో ఎన్‌సీసీ యూనిట్ ఉండాలనే యోచనలో ఉన్నామన్నారు. జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే క్యాడెట్లు థర్డ్ టైర్ ఏసీలో ప్రయాణించే వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. ఇందుకు అయ్యే ఖర్చులో సగం కేంద్ర ప్రభుత్వం, మిగిలిన సగం తాము భరించనున్నామన్నారు. అలాగే విద్య, ఉద్యోగావకాశాలలో 15 శాతం మార్కులు ఉంటాయన్నారు. వీటిని ఒక్కసారి మాత్రమే ఉపయోగించుకోవచ్చని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వివరించారు.

సత్యరథానికి బ్రహ్మరథం

అన్నవరం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో 20 రోజులుగా సత్యదేవుని ప్రచార రథంతో నిర్వహిస్తున్న హిందూ ధర్మ ప్రచారానికి గిరిజనులు బ్రహ్మరథం పడుతున్నారని అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. ఏజెన్సీ కేంద్రమైన చింతూరులో శనివారం నిర్వహించిన సత్యదేవుని సామూహిక వ్రతాలకు విశేష స్పందన లభించింది. వందలాది మంది గిరిజనులు సత్య వ్రతాలు వ్రతాలు ఆచరించారని ఈఓ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బోర్డర్‌కు సమీపంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం 'కుంట' గ్రామంలోని మణికేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23న సత్యదేవుని సామూహిక వ్రతాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కుంట, పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న తెలుగువారు ఈ వ్రతాల్లో పాల్గొనాలని కోరారు. సామూహిక వ్రతాల్లో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, సూపరింటిండెంట్ కంచి మూర్తి, అర్చకులు నర్సింహమూర్తి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



సత్యదేవుని సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

నేటి నుంచి పీఎం విశ్వకర్మ పథకం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): చేతి వృత్తుల వారి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదివారం నుంచి పీఎం విశ్వకర్మ పథకాన్ని అమలు చేయనుంది. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు వెంకటేశ్వరరావు ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్పాదక సామర్థ్యాన్ని, ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచి మార్కెట్ సదుపాయాన్ని విస్తృతం చేయడం ఈ పథకం ఉద్దేశమన్నారు. 18 సంవత్సరాలు నిండి హస్త కళల కుటుంబ నేపథ్యం ఉన్న వారు ఈ పథకానికి అర్హులు. వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, శిల్పకారులు, చర్మకారులు, తాపీ పనివారు, నాయి బ్రాహ్మణులు, రజకులు, దర్జీలు, దుస్తుల తయారీ, బొమ్మల తయారీ మొదలైన వృత్తుల వారికి పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్, ఐడీ కార్డ్ ఇస్తారన్నారు. ప్రభుత్వ ఉద్యోగి కుటుంబ సభ్యులు, ఐదేళ్ల క్రితం వరకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలలో ప్రయోజనం పొందిన చేతి వృత్తుల వారికి ఈ పథకం వర్తించదన్నారు. ముద్ర ..పీఎం స్వానిధి పథకం కింద రుణం పొంది పూర్తిగా చెల్లించిన వారు అర్హులవుతారన్నారు. పథకం కింద నమోదు చేసుకున్న అర్హులకు 15 రోజులపాటు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.500 స్టైఫండ్ చెల్లిస్తారన్నారు. అనంతరం రూ.15వేల విలువైన టూల్ కిట్స్ అందజేస్తారని పేర్కొన్నారు. మొదటి విడతగా 5 శాతం వడ్డీతో రూ.లక్ష, రెండవ విడతగా రూ.2 లక్షలు రుణం మంజూరు చేస్తారన్నారు. తర్వాత వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కూడా కల్పిస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ) విలేజ్, వార్డ్ కార్యదర్శులతో పీఎం విశ్వకర్మ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.


జగనన్నకు పలుకుదాం.. ఘన స్వాగతం: సీఎం జగన్ రోడ్ షోలో మహిళా కెరటం


ఈ అపురూప ఘట్టాన్ని ఫోనులో బంధిద్దాం: సీఎం జగన్‌కు ఫొటోలు తీస్తున్న యువతి


మామయ్య దగ్గరకు వెళ్దాం పదండే: బిడ్డల్ని తీసుకుని సభకు వెళ్తున్న మహిళ


ప్రియనేత ప్రసంగం వినాలని..: సభకు వస్తున్న దివ్యాంగుడు


ఉత్సాహతరంగమై..: జై.. జగన్ అంటూ నినదిస్తున్న యువత


వడివడిగా: సీఎం సభకు తరలుతున్న మహిళా వాహిని

ప్రభంజనం


జనప్రవాహం: నిడదవోలు వీధుల్లో నుంచి సీఎం సభకు తరలుతున్న ప్రజానీకం

జన సంక్షేమ సారథి.. ఆంధ్రప్రదేశ్ ప్రగతి వారధి.. జనహృదయ విజేత.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అడుగు మోపిన వేళ.. నిడదవోలు పట్టణం జన ప్రభంజనాన్ని తలపించింది. తమ ప్రియ నేతను కళ్లారా చూసేందుకు.. ఆయన మాటలను చెవులారా విని, నవచైతన్యాన్ని పొందేందుకు.. జనం వెల్లువొచ్చిన గోదారిలా తరలివచ్చారు. హెలిపాడ్ నుంచి సీఎం వచ్చే మార్గం.. పట్టణంలోని రోడ్లు.. సభా ప్రాంగణం లోపల.. బయట.. ఇలా ఎటు చూసినా జనసందోహమే. దారి పొడుగునా తమ అభిమాన నేతపై పూలజల్లులు కురిపించారు. ఆయన ప్రసంగాన్ని ఆద్యంతం శ్రద్ధగా విన్నారు. తమను చేయిపట్టి ప్రగతి దారుల్లో నడిపించే నేత ఆయనేనని త్రికరణశుద్ధిగా నమ్ముతూ.. 'జై జగన్' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు.

– నిడదవోలు


ఆనందమానందమాయే: తమకు అభివాదం చేస్తున్న సీఎం జగన్‌ను చూసి చేతులు ఊపుతున్న జనం


చల్లగా ఉండు తండ్రీ: వృద్ధురాలి ఉద్వేగం


సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కళ్లారా చూసిన వేళ అక్కచెల్లెమ్మల ఆనందం


జగనన్నకు చెబుదాం: సమస్యలు చెప్పుకొనే వారి కోసం సభాప్రాంగణంలోనే స్పందన కౌంటర్


సీఎం ప్రసంగాన్ని శ్రద్ధతో, ఆనందంతో వింటున్న యువతులు


జై జగన్: మార్మోగిన జగన్నినాదం


మహిళోత్సాహం: సీఎంను చూసిన వేళ ఆనందం

నాఫెడ్ కేంద్రాలు నిరంతరం కొనసాగించేందుకు చర్యలు

అంబాజీపేట, కొబ్బరి రైతులను ఆదుకునేందుకు ఏడాది పొడవునా నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాలను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్ యు.సుధాకరరావు, నాఫెడ్ బ్రాంచి మేనేజర్ టి.నాగేశ్వరశర్మ ఆధ్వర్యాన అంబాజీపేట మార్కెట్ యార్డ్‌లో నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ, ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఆరు నెలల పాటు కొనసాగుతాయని, వీటిని నిరంతరం కొనసాగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తామని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టుగానే కొబ్బరి కూడా కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతుల వద్దకు అధికారులే నేరుగా వచ్చి కొబ్బరిని పరిశీలించి కొనుగోలు చేస్తారని చెప్పారు. నాఫెడ్ కేంద్రంలో కొబ్బరి విక్రయించే రైతులు తమ వివరాలను ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. నాఫెడ్ కేంద్రాల్లో మిల్లింగ్ కోప్రాను క్వింటాల్‌కు రూ.10,860, బాల్ కోప్రాను క్వింటాల్‌కు రూ.11,750కి కొనుగోలు చేస్తారని తెలిపారు.

దుమ్ము, ధూళి, పెంకులు ఒక శాతం కంటే ఎక్కువ ఉండకూడదని, ముడతలు ఏర్పడిన, పగిలిన, నలుపు, బూజు కొబ్బరి చిప్పలు 10 శాతం కంటే ఎక్కువ ఉండకూడదని చెప్పారు. తేమ 6 శాతం దాటకుండా రైతులు చూసుకోవాలని ఎంపీ ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎస్.విశాలాక్షి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే చిట్టిబాబు

వాడపల్లి క్షేత్రం.. భక్తజనసంద్రం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తజనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు 35 వేల మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారిని కొబ్బరి మొవ్వ ఆకులు, వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ సేవలు, పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, విరాళాల ద్వారా స్వామివారికి రూ.30,57,723 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

బాలబాలాజీ సన్నిధి.. భక్తుల రద్దీ

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.1.61 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.21 లక్షలు, నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళాలుగా రూ.40,423 చొప్పున వచ్చాయి. స్వామి వారిని 3,069 మంది భక్తులు దర్శించుకున్నారు. 2,285 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి, ట్రస్టు బోర్డు సభ్యులు పర్యవేక్షించారు.


ఆలయంలో భక్తుల కోలాహలం


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి